మనసొంతంగా



# మనదనుకుందాం...రా!

అందరూ ఏదో ఏదో మాట్లాడుతున్నారు. గట్టిగా వాదిస్తున్నారు. గొడవ పడుతున్నారు. ఎవరి ఆలోచనలు వారివి, ఎవరి పంతం వారిది. 'లా' పాయింట్లు లేవనెత్తడంలో ఒకరికి మించిన వారొకరు.

ఆత్మగౌరవం అనాలో, అహం అనాలో తెలియడం లేదు, కాని దాన్ని నిలబెట్టుకోవాలన్న ఆరాటం, మాట నెగ్గించుకోవాలన్న పట్టుదలే కనిపిస్తోంది తప్ప వ్యవహారాన్ని సామరస్యంగా చక్కదిద్దుదాం, మంచితనంతో పరిష్కరిద్దాం అనే ధోరణే కనబడడం లేదు. అసలు సమస్య వుంటే కదా పరిష్కరించడానికి! వున్న సమస్యల్లా ఒక్కటే 'నీవా నన్ను ప్రశ్నించునది? నీవా నన్ను ధిక్కరించునది' అనే అహంభావం. దీనితో రోజుల తరబడి వేడివేడి చర్చలు కొనసాగుతూనే వున్నాయి. నేను మాత్రం చోద్యం చూసినట్టు వాటన్నిటినీ గమనిస్తూనే వున్నాను.

నేను! అందరి ఆడపిల్లలలాగే, కనులనిండా వేయి కలలతో, మనసునిండా తీపి భావాలతో నునుసిగ్గుతో దోబూచులాడుతూ పక్షం రోజుల క్రితమే పెళ్లిచేసుకున్నాను. పెళ్ళిచేసుకున్నాను అంటే మళ్లీ నా అహాన్ని ప్రదర్శించినట్టవుతుందేమో! నాకూ సారధికి పక్షంరోజులక్రితం వున్నంతలో వైభవంగా పెళ్ళయింది. పెళ్ళయిన పదిరోజుల వరకు ఆ ఆనంద డోలికలలో తేలిపోయాను. ఆ తర్వాత తెలిసింది. పెళ్లికిముందే రేగిన చిచ్చు, మరింత ఉధృతమై రగులుతూనే వున్నదని, వేడివేడి సెగలు కమ్ముతూనే వున్నదని.

ఆరోజు... నేను మావారు కలసి దామోదరం మామయ్య వాళ్ళింటికి వెళ్లాం. మామయ్య అంటే మా చుట్టమేం కాదు. వాళ్లమ్మాయి, నేను చిన్న ప్పటినుంచి ఫ్రెండ్స్. ఆయనే మా పెళ్లి కుదిర్చారు. అందుకే(నేమో) వాళ్లింటికి వెళ్లాం. ఆశ్చర్యంగా నాన్నగారుకూడా అక్కడ వున్నారు. వరండాలో కాసేపు కబుర్లయ్యాక నేనులోపలికి వెళ్లిపోయాను. కొంతసేపయిన తర్వాత నాన్నగారు, మావారు గట్టిగా మాట్లాడుకోవడం విని గదిలోకి వచ్చాను. వాళ్లమాటలు నాకు స్పష్టంగా వినపడుతున్నాయి.

"మర్యాద తెలీని వాళ్ళతో సంబంధం వల్ల మాపరువు పోయింది."అది మావారి గొంతు.

"ఇక్కడెవరూ మర్యాద తెలీని వాళ్లు లేరు. ఆమాటకొస్తే మేమే పరువుకోసం ఎక్కువ పాకులాడతాం. పరువు తక్కువ పనులు చేయడం మాఇంటావంటా లేదు."అది మానాన్నగారి స్వరం.

"కనబడుతూనే వుంది. అంత మర్యాద, పరువు తెలిసిన వాళ్లైతే ఇలాంటి పనిచేయరు"

"మళ్లీ అదేమాట అంటారే! ఎవరి మర్యాదలకేం లోటుచేశాం? ఏవండీ దామోదరంగారు మాట్లాడరేం?"

"చెప్పండి దామోదరంగారు! మీరు ఎన్నో పెళ్లిళ్లు చేయించారు. అల్లుళ్ళని మామగార్లందరూ ఇలాగే చూసుకున్నారా?"

"ఇప్పుడు అల్లుడి హోదాకేం భంగం కలిగిందట?"

"అదుగో ఆ వెటకారమే వద్దంటాను. అల్లుడికిచ్చే మర్యాద ఇదేనా?" కస్సుమన్నారు మావారు.

"సారధి! నెమ్మది నెమ్మది అవతల అమ్మాయివింటే బాధపడుతుంది. అయినా వ్యవహారాన్ని పరిష్కరించుకోక ఇలా వాదులాడుకుంటే ప్రయోజనం ఏముంది చెప్పు!"అన్నారు దామోదరం మావయ్య.

"ఎన్నిసార్లు చెప్పమంటారు? తేల్చవలసింది ఆయనే"

"నేను తేల్చేదేముంది? అడిగినంత కట్నం పువ్వుల్లో పెట్టి ఇచ్చాను. అందరికీ నా తాహతుకు తగ్గట్టుగా మర్యాదలు చేశాను. ఇంకా ఏం చేయాలి?"

"మళ్లీ అదేమాట అంటారేం?. కట్నం ఎవరికిచ్చారు?. నాకిచ్చారా. మీ అమ్మాయి పేరుమీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. అదేం పని? అదేనా మర్యాదంటే"

"అందులో తప్పేముంది? అమ్మాయితోపాటే ఆ కట్నం డబ్బుకూడా మీ ఇంటికి వచ్చినట్టేగా. అమ్మాయి మీదయినప్పుడు ఆ డబ్బుమాత్రం మీదికాదా. మీ చేతుల్లో పెట్టాక మీఇష్టం ఏం చేసుకుంటారో చేసుకోండి"

"అది పద్దతేనా? చెప్పండి దామోదరంగారు. అలాగేనా కట్నం ఇచ్చేది? ఆ డబ్బేదో నా పేరుమీదే బ్యాంక్‌లో వేయొచ్చుగా? వాళ్లమ్మాయి పేరుమీద ఎందుకు వేశారు.?"

"అమ్మాయి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అలా చేశాను. అది తప్పా?"

"అంటే... అంతే ధానర్థం ఏమిటి? మమ్మల్ని అనుమానించడమేగా? ఇంతకంటే అవమానం ఏముటుంది.?"

"ఇందులో అవమానం ఏమీలేదు. అసలే రోజులు బాగోలేవు. రేపు ఏదైనా జరగరానిది జరిగితే దాని బతుకు ఏమైపోవాలి?" నాన్నగారి అంతరంగం అప్పుడు బయటపడింది. కాని అదే మా వారికి మళ్లీ కోపం తెప్పించింది.

"అంటే కట్నం సొమ్ము తీసుకున్నాక మీ అమ్మాయిని మేమేదో చేస్తామనేగా మీఉద్దేశ్యం? అంత అనుమానం వున్నవాళ్లు అసలు పెళ్లెందుకు చేశారు? హాయిగా ఇంట్లోనే వుంచుకోలేకపోయారా? " ఆవేశంగా ప్రశ్నించారు మావారు.

"ఏ తండ్రైనా కన్నబిడ్డ జీవితం సుఖంగా సాగిపోవాలనుకుంటాడు. అందులో తప్పేముంది?"

"అదే... అదే అక్కడే మీరు తప్పుచేశారు. మీ అమ్మాయికి మేమేదో లోటు చేసేస్తామని, రాచిరంపాన పెడతామని మీ అనుమానం. మీ అమ్మాయికేదో కీడు జరిగిపోతుందని మీ భయం. మేమంతా మీ దృష్టిలో దుర్మార్గులం, రాక్షసులం... అంతేగా?"

"అవన్నీ మీరనుకుంటున్న మాటలు. నేనేం అనలేదు. అయినా నేనేదైనా అంటే అదుగో ఆడపిల్ల తండ్రి అణిగి మణిగి వుండాలికాని అలా [illegible] అని నామీద తాటిచెట్టండ ఎత్తులేస్తారు. అయినా నిండామునిగిన వాడ్ని నాకు భయమేంటి? మీకు అమ్మాయి కావాలి. మీ ఇంటికి మంచి కోడలు కావాలి. ఆమెను అంతా ప్రేమగా చూసుకుంటాం అనే ఆలోచనే మీకుంటే ఇలా కట్నం, డిపాజిట్ల గురించి తగాదాకు దిగరు. అమ్మాయి ముఖ్యమైనప్పుడు కట్నం ఎవరి పేరుమీద వుంటేనేం?

"దీన్ని బట్టి మీ ఆలోచన అర్థమవుతోంది.



మీకు అమ్మాయికంటే కట్నం ముఖ్యం. డబ్బు తర్వాతే మనిషి. మీ తత్వం ఇప్పుడు బయట పడింది." దాదాపు గద్గద స్వరంతో నాన్నగారు గట్టిగా అనేశారు. దామోదరంగారు నాన్నగారిని సముదాయించారు.

నాన్నగారి మాటలకు మావారు కొంచెం వెనక్కి తగ్గారు. కాని తన వాదనని మాత్రం కొంచెంకూడా సడలించలేదు.

"ఆడపిల్ల సొమ్ము ఆశించే నీచగుణం మా ఇంటావంటా లేదు. మేమేమీ కట్నంకోసం బేర మాడలేదు కూడా. దామోదరంగారు ఎంతచెప్తారో అంతకే ఒప్పుకున్నాం. కాని మీరు అందరూ చేసే ట్టుగానే కట్నం డబ్బుని మాకివ్వాల్సింది. అలా చేస్తే మేమే మీ అమ్మాయి పేరుమీద డిపాజిట్ చేసి వుండేవాళ్లం. అది మర్యాదగా వుండేది. కాని మీరలా చేయలేదు. మమ్మల్ని అనుమా నించారు. మా బంధువుల్లో, స్నేహితుల్లో మా పరువు పోయింది. నలుగురు నాలుగు రకాలుగా కామెంట్ చేశారు. ఇది అమ్మాయికి సంబంధించిన వ్యవహారం కాదు. మా పరువు ప్రతిష్ఠలకు సంబం ధించినది. అందుకే ఇంతగా పట్టుపట్టాల్సివచ్చింది" –అని సుదీర్ఘ వివరణ ఇచ్చారు మావారు.

"అది మీరు చెప్పకోవడంతో వుంటుంది. ఇందులో పరువు తక్కువ పనేంటో నాకేమీ అర్థం కావడంలేదు. అంతగా పరువు ప్రతిష్టల కోసమైతే మీరే అమ్మాయి పేరుమీద డిపాజిట్ చేయించినట్టు చెప్పకుంటే సరిపోయేది. అసలు సమస్యే వుండేది కాదు" నాన్నగారు ఓ పట్టాన లొంగే ఘటంకాదు.

ఇలా వీళ్ళిద్దరిమధ్య వ్యవహారం 'తెగదు ముడి పడదు' అన్నట్టుగా సాగిపోతూనేవుంది.

అలా వింటూనే వున్నాను. వారి మాటల్లో పంతాలు, పట్టింపులు, అహం కొట్టొచ్చినట్టు కని పించాయి. ఇక ఎక్కువసేపు నిలువలేకపోయాను. మెల్లగా వరండాలోకి వచ్చేశాను.

నన్నుచూసి వారిద్దరూ సంభాషణ ఆపేశారు. మౌనం కొద్దిసేపు రాజ్యమేలింది. బహుశా నారాక నాన్నగారికంటే మావారికే కాస్తంత అసహనాన్ని కలిగించింది. అందుకే 'పోదామా' అన్నట్టు నావంక చూశారు. ఇందులో దామోదరం మావయ్య,

"అమ్మా కాస్త మా ముగ్గురికి కాఫీ నీళ్లు పోయకూడదూ. నీ ఫ్రెండ్ లోపలేం చేస్తోంది?" అన్నారు.

"అమ్మాయ్! నువ్వు లోపలికివెళ్లు" నాన్నగారు చిరాగ్గా అన్నారు.

"వెళ్ళను నాన్నా! ఇక్కడే వుంటా! ఇందా కటి నుంచి మీరిద్దరూ కట్నం డబ్బు గురించి తెగ వాదులాడుకుంటున్నారు. అది మీ ఇద్దరి సొంత వ్యవహారంలా మాట్లాడుకుంటున్నారు. కాని అసలు మనిషిని నేనున్నానన్న సంగతి మీ ఇద్దరిలో ఒక్కరికైనా గుర్తుందా? ఇది నాకు సంబంధించిన వ్యవహారం. కాని నా ఇష్టాఇష్టాలతో నా అభిప్రా యాలతో నిమిత్తం లేనట్టుగా వ్యవహరిస్తున్నారు. అది తప్పు. నాకూ వ్యక్తిత్వం వుంది. అది మీరిద్దరూ గుర్తించి తీరాలి.

నాన్నా! నువ్వు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసేముందు నాతో ఒక్కమాటైనా చెప్పి నా అభిప్రాయం తెలు సుకుని వుండాల్సింది. నా అత్తింటి పరువుపోతే నా పరువూ పోయినట్టేనని నువ్వు తెలుసుకుని వుండాల్సింది. కేవలం డబ్బులో డిపాజిట్లో కన్నకూతురి భవిష్యత్తును చక్కదిద్దలేవు నాన్నా. లేనిపోని అనుమానాలకు నువ్వు బీజం వేశావు"

అని మావారివైపు తిరిగి–

"జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడు అది నాసొత్తు. మీకంతగా కావాలంటే నన్నే అడగవల సింది. నేను ఆనందంగా ఇచ్చివుండేదాన్నేమో! ఇప్పుడు మా నాన్నను పరువు, ప్రతిష్ఠ వంకపెట్టి అడగడంలో మీ అల్పత్వాన్ని బయటపెట్టుకు న్నారు. ఒక్కసారి ఆలోచించండి. పెళ్లయ్యాక మనమిద్దరం కాదు. ఒక్కటి. అటువంటప్పుడు ఆ డిపాజిట్ నాది ఎలా అవుతుంది? మనిద్దరిది అవు తుంది. అలాంటి ఆలోచన మీకు కలగాలి. కాని వాదివేరు, నా పెళ్లానిది వేరు అనుకుంటున్నారు కాబట్టే ఈ తేడాలొచ్చాయి. మనది అనుకున్నప్పుడే కాపురం పునాది గట్టిపడుతుంది. ముందుగా మీరు తెలుసుకోవలసిన విషయం అదే! ఇక మీ ఇష్టం" అన్నాను.

రెండు క్షణాలాగి.

"పదండి మనింటికి వెళ్దాం" అన్నాను.

మావారు మెల్లగాలేచి నాతోపాటు బయటకు నడిచారు.

–'మోతీలాస్య'